# ఆమె నవ్వింది

## ఆమె నవ్వింది !

అతను బిత్తరపోయాడు.

ఆమె మళ్ళీ నవ్వింది.

తోడేల్ని మంచి చేసుకోవడానికి మేకపిల్ల నవ్వినట్టు నవ్వింది.

( జంతువులకు నవ్వడం రాదంటారా ! వస్తేనే )

ఆమె తనను చూసి నవ్విందా ? నమ్మలేనట్టుగా చూశాడు అతడు.

ఆమె మళ్ళీ నవ్వింది.

అతడు గిర్రున తలతిప్పి వెనక్కు చూశాడు. అక్కడ ఎవరూ లేరు. అతడు ఆమె ముఖంలోకి అయోమయంగా చూశాడు.

ఆమె ఓరగా చూసి మళ్ళీ నవ్వింది.

అవును ! సందేహం లేదు. ఆమె నవ్విందితననుచూసే. అతడికి మతి పోయినట్టే అయింది. ఇదికలా ? తను ఆఫీసు

లోనే వున్నాడా ? తనకు ఎదురుగా వున్నది ఆమేనా ? లేక.... ?

అదే నవ్వు ! అవును ! ఆమే ! సందేహం లేదు.

అతడి వళ్ళు ఝల్లుమంది.

అతనూ నవ్వాడు. అచ్చం మేకపిల్లను చూసి తోడేలు నవ్వినట్టే నవ్వాడు. అతడి ఎత్తుగా వుండే ఆ రెండు పళ్ళూ ఆమెను వెక్కిరించాయి.

ఆ నవ్వు ఆమెకు వెగటు కలిగించింది. అయినా ఆమె మృదువుగా మళ్ళీ నవ్వింది. అతడు అందించిన కాగితాలను సుతారంగా అందుకుంది. అలా అందుకుంటు న్నప్పుడు ఆమె చెయ్యి అతడి చేతికి తగిలింది.

అతడి నరాలు జివ్వుమన్నాయి. పెదవులను నాలుకతో తడుపుకున్నాడు. మూతికి అంటిన మేకపిల్ల రక్తాన్ని తోడేలు నాలుకతో నాక్కుంటున్నట్టుగా అన్పించింది ఆమెకు.

ఆమె పేరు సుశీల కాదు. అమల.

అతడి పేరు మోహన్ కాదు. రంగనాథం.

ఆమె తెలుగు పాఠకలోకాన్ని ఉర్రూతలూగించే నవలామణి నవలలోని నాయిక కాదు. అతడు ఆ నాయిక హృదయవీణను అలవోకగా మీటే నాయకుడూ కాదు.

ఆమె ఒక ప్రభుత్వ ఆఫీసులో టైపిస్టు. అతడు ఆ ఆఫీసు మేనేజరు.

ఆమె నవ్వితే ముత్యాలు రాలి మొజాయిక్ ఫ్లోర్ మీద జరజర జారలేదు. మల్లెలు గుబాళించలేదు. పన్నీరు చిలకలేదు. అమృతం వర్షించలేదు.

అయినా రంగనాథానికి ఆమె నవ్వులో అవన్నీ కన్పించాయి.

టైపు చెయ్యవలసిన కాగితాలు తీసుకొని వెనక్కు తిరిగింది. నాలుగడుగులు వేసి ఆగి, మెడ తిప్పి వెనక్కు చూసింది. అతడు ఆమెనే చూస్తున్నాడు. ఆ కళ్ళల్లో విజయగర్వం....

ఆమె చివ్వున ముఖం తిప్పుకొని, చరచర గది బయటికి నడిచింది.

* * *

అమల టైపు మిషన్ ఎదురుగా వున్న కుర్చీలో కూలబడింది. చేతిలోని కాగితాలను టేబుల్ మీద పెట్టింది. పైటకొంగుతో ముఖానికి పట్టిన చెమట తుడుచుకుంది. అరచేతుల చెమట కూడా తుడుచుకుంది. వళ్ళంతా చెమట్లతో ముద్దయినట్టుగా అన్పించింది. ఆమెకు తన పాదాలకింద

వున్న భూమాతే తనను దగా చేస్తున్నట్టుగా అన్పించింది. అరే! ఏమిటిది? తన కుర్చీ కిందకు దిగిపోతుందేమిటి? తను కుర్చీతోసహా లోతు తెలియని అగాధంలోకి పడిపోతోంది. ఇవేమిటి? తనను చుట్టేస్తున్నాయి? బుసలు కొడ్తున్నాయేమిటి? విషనాగులు! తనను కాటువెయ్యడానికి సిద్ధంగా వున్నాయి.

అమల వయసు ఇరవై రెండేళ్ళు. గొప్ప అందగత్తె కాదు. చారెడేసి కళ్ళు లేవు. ఆమె నడుస్తూంటే హంసలు ఈర్ష్య పడవు. ఆమె చూపుల్లో, నడకలో, మాటతీరులో ఏదో ప్రత్యేకత, మామూలు ఆడపిల్లల్లో కన్పించని ప్రత్యేకత వుంది. ఆ ప్రత్యేకత చూసేవాళ్ళకు వెర్రులు పుట్టించదు. ఆమెపట్ల గౌరవభావాన్ని కలిగిస్తుంది.

కాలేజీలో ఆమెను అందరూ గర్విష్టి అనేవారు. మగపిల్లల్ని చూసి ఆమె సిగ్గుతో మెలికలు తిరిగిపోయేది కాదు. వారి వునికినే గమనించనట్టు వుండేది. అందుకే ఆమె అంటే చాలామంది విద్యార్థులు పడిచచ్చిపోయేవాళ్ళు. ఆమెతో మాట్లాడడం గొప్పగా భావించేవారు. సిగ్గుతో మెలికలు తిరిగిపోకుండా, హుందాగా, నిటారుగా, ఈ ప్రపంచంతో నాకేం పని అన్నట్టు నిర్లక్ష్యంగా, వాళ్ళ మధ్యనుంచి నడిచి వెళ్ళిపోయే ఆమెను అల్లరి పట్టించే ధైర్యం ఎవరికీ వుండేది కాదు.

ప్రకాశరావు అందగాడు. ధనవంతుడు. తెలివైనవాడు. ఎప్పుడూ బట్టలు నలగకుండా టిప్‌టాప్‌గా వుండేవాడు. ఆడపిల్లల కలల్లో రాజకుమారుడు అతడు. అందరి కళ్ళూ అతడిమీదే వుండేవి. కాని అతడి కళ్ళు మాత్రం అమలమీద వుండేవి........

" అమలా ! ఏమైంది ? ఒంట్లో బాగాలేదా ? " పక్క టైపిస్టు కమల అడిగింది.

అమల తృళ్ళిపడింది. తల పైకెత్తింది. " అబ్బే ఏం లేదు. " అని కొంగుతో ముఖం తుడుచుకుంది.

కమల ఓసారి ఆశ్చర్యంగా ఆమెకేసి చూసి తన పనిలో మునిగిపోయింది.

అమల యాంత్రికంగా టైపు మిషన్‌లో పేపర్ను ఇన్సర్ట్ చేసింది వేళ్ళు మిషన్‌మీద కదులుతున్నాయి. చూపులు పక్కనవున్న ఒ. సి. మీద కదులుతున్నాయి. కాని మనసు మాత్రం గతాన్ని తొలుచుకుంటూ పోతున్నది.

ఆరోజు .... వర్షం పడడంవల్ల నేలంతా చితచిత లాడుతోంది. కుచ్చిళ్లు కుడిచేత్తో పైకి పట్టుకొని, బస్టాండు వైపు నడుస్తున్నది. అనుకోకుండా అరటితొక్కమీద కాలు పడింది. జర్రున జారింది. కాని క్షణంలో మెరుపులా లేచి నిల్చుంది. ఎడం చేతిలోవున్న పుస్తకాలు దూరంగా పడిపోయాయి అమె పుస్తకాలు తీసుకోవడానికి రెండడుగులు

వేసిందో లేదో, ప్రకాశరావు పుస్తకాలతో ఆమె ఎదుట నిలబడి వున్నాడు. పుస్తకాలు అందుకొని కృతజ్ఞతలు చెప్పింది అమల.

"దెబ్బ తగిలిందా ?"

"లేదు. థ్యాంక్యూ !" అన్నది మరోసారి.

ప్రకాశరావు పలకరింపుగా నవ్వాడు. ఆమె నవ్వలేదు.

ఆ తర్వాత వరసగా రెండు మూడు రోజులు ప్రకాశరావు బస్‌స్టాండులో నవ్వుతూ ఆమెకు ఎదురొచ్చాడు. కాని ఆమె చూసీ చూడనట్టే ముభావంగా వుండిపోయింది. ఒకరోజు ఆమె పక్కగా వెళ్ళి నిలబడి పలకరించాడు. ఆమె నిర్వికారంగా, ముభావంగా సమాధానం ఇచ్చింది. ప్రకాశరావు ఆమె దగ్గర చనువు పెంచుకోలేకపోయాడు. అతడి అహం దెబ్బతిన్నది. దెబ్బతిన్న అహం ద్వేషంగా మారింది. అమె వెళ్తూవుంటే అన్యాపదేశంగా ఆమెమీద విసుర్లు విసిరేవాడు. తోటి విద్యార్థులతో కలిసి పిచ్చి జోక్స్ వేసి నవ్వేవాడు. కాని ఆమె ఇవేవీ లక్ష్యపెట్టలేదు. అసలు పట్టించుకోలేదు.

క్రొత్తగా వచ్చిన ఇంగ్లీషు లెక్చరర్ ఆనందరావు స్ఫురద్రూపి. చాకులా దూసుకుపోయే వ్యక్తిత్వం

గలవాడు. యువకుడు. అవివాహితుడు. చాలామంది ఆడపిల్లలు పని కల్పించుకొని అతనిచుట్టూ చేరేవాళ్ళు.

ఒకరోజుఅమల, జానకితో సినిమాకు వెళ్ళి వస్తుండగా ఆ న ం ద రా వు ఎదురైనాడు. ఇద్దర్నీ చిరునవ్వుతో పలకరించాడు. జానకి ఆనందంగా నవ్వుతూ చేతులు జోడించింది. అమల గౌరవపూర్వకంగా నమస్కరించింది. కాని నవ్వలేదు. ఆనందరావు ఓసారి ఆమె ముఖంలోకి చూసి వెళ్ళిపోయాడు.

" మరీ అంత మూతి బిగింపు అన్ని వేళలా, అందరి ముందూ బాగుండదు. " అన్నది జానకి.

" అంటే ? " అమల అడిగింది. జానకి అలా ఎందు కన్నదో అర్థం కాలేదు.

" మన లెక్చరర్ కదా ? కాస్త చిరునవ్వుతో పలకరిస్తే కొంపలేం మునిగిపోతాయి ? అతను నువ్వలా సీరియస్‌గా వుండడాన్ని గమనించి చిన్నబుచ్చుకున్నాడు."

ఆనందరావుకు తనంటే ఇష్టం అని అమలకు తెలుసు ఆ విషయం జానకికి కూడా తెలుసు.

" ఏమో జానకీ. నాకు నవ్వాలనిపించదు. అది నా స్వభావం. "

' స్వభావమా గాడిద గుడ్డా ? కాస్త నవ్వుతూ మాట్లాడగానే శీలం పోతుందని భయంలా వుంది.... '

'ఛ! ఛ! అలాంటి పిచ్చి అభిప్రాయాలు నాకు లేవు. ఒకసారి నవ్వుతూ మాట్లాడితే చనువు పెంచుకోవడానికి ప్రయత్నిస్తారు, చాలామంది. చివరకు ఆ చనువు అలుసుగా మారే ప్రమాదం వుంది. అందుకే నేను నవ్వను. కాదు—నాకు నవ్వాలనిపించదు. అంతే!'

'ఏమో తల్లీ. నేను మామూలు ఆడపిల్లను. నీ భావాలు నాకు అర్థం కావు.'

'నన్ను నువ్వయినా అర్థం చేసుకో. ఈ ఆనందరావు మాస్టారినే తీసుకో—ఈయనకు నేనంటే ఇష్టమని నీకూ తెలుసు. పాఠం చెప్పినంతసేపూ అతడి కళ్ళు నామీదే వుంటాయి. అలాంటప్పుడు చనువుగా నవ్వానే అనుకో.... అనవసరంగా ఏదేదో ఊహించుకొని....'

"అందువల్ల నష్టం ఏమిటో? ఆనందరావుకంటే మంచి మొగుడు దొరుకుతాడా నీకూ?"

'జానకీ చాలా అసహ్యంగా మాట్లాడుతున్నావ్? ఇలాంటి మాటలు నాకు ఇష్టం వుండదని నీకూ తెలుసు'

'అయితే పెళ్ళిచేసుకోవా?'

'అలా అని నేను అనలేదే. కాని అందుకోసం కన్పించిన ప్రతి మగవాడితో చనువు పెంచుకోవాలా? అనవసరమైన చిరాకుల్లో ఇరుక్కోవడం నాకు వచ్చదు.'

జానకి సంభాషణ పెంచలేదు........

" అమలా ! అయిందా ? "

అమల ఆలోచనల దారం పుటుక్కున తెగింది. చివ్వున తలెత్తి చూసింది. టైపుమిషన్‌మీద చకచక యాంత్రికంగా కదులుతున్న అమల చేతుల వేళ్ళు ఆగిపోయాయి. ఎదురుగా రంగనాథం. రంగనాథం ఆమెకు పక్కగా చాలా దగ్గరగా నిల్చొని వున్నాడు.

అతడి కంఠం అదోలా వుంది మాటలో మునుపులేని చనువు. కళ్ళల్లో ఏదో జుగుప్స కలిగించే భావం....చేతిలో కాగితాలు అతడి ముఖంమీద కొట్టి బయటికి పరుగు తియ్యాలనిపించింది.

' అయిపోయింది. ఐదు నిముషాల్లో తెచ్చిస్తాను. మీరు వెళ్ళండి. ' సాధ్యమైనంత సౌమ్యంగా మాట్లాడడానికి ప్రయత్నించింది....అమల బుర్రలో స్మృతి పేటిక మళ్ళీ తెరుచుకుంది....

అమల చదువు ఇంటర్‌తోనే ఆగిపోయింది. తాసీల్దారుగా పనిచేస్తూ, డెప్యూటీ కలెక్టరు కాకుండానే తండ్రీ ఆకస్మికంగా గుండెపోటుతో మరణించాడు. గుర్రప్పందాలు ఆడే అలవాటున్న అతను, జాక్‌పాటులోని ఐదు నంబర్లూ సరిగ్గా ఏనాడూ చెప్పలేకపోయాడు. ఆస్తంతా

ఆ ఐదు నంబర్లకే అర్పించి, భార్యకు ఐదుగురు బిడ్డల్ని అప్పగించి వెళ్ళిపోయాడు. అందర్లో పెద్దది అమల. అందరూ స్కూలు లెవల్లో చదివే వాళ్ళే. తల్లి రోగిష్టిది. ఎప్పుడూ ఆయాసం—రక్తపోటు. ఏమున్నా లేకపోయినా ఆమెకు మందులు మాత్రం వుండాలి. ఆ జబ్బు అలాంటిది. ప్రభుత్వంనుంచి లభించే ఫ్యామిలీ పెన్షన్‌తో నెలలో సగం రోజులు గడవడమే కష్టంగా వుంది.

అమల టైపు నేర్చుకుంది. అతి కష్టంమీద టైపిస్టుగా తాత్కాలిక ఉద్యోగం దొరికింది.

ఉద్యోగంలో చేరిన రోజు ఆఫీసు మేనేజరు దగ్గరకెళ్ళి జాయినింగ్ రిపోర్టు ఇచ్చింది. రిపోర్టు అందుకుంటున్న అతని చెయ్యి ఆమె చేతిని తాకింది. అమల అలాంటివి పట్టించుకోదు. కాని అతడు కావాలనే తాకేడు అని తెలుసుకున్న అమలకు చిరాకనిపించింది. అతడి ముఖంలోకి చూసింది. అతడు అదోలా నవ్వాడు. అమల నవ్వలేదు. నొసలు ముడివడ్డాయి. రంగనాథం ముఖం ముడుచుకు పోయింది

అదే సమయంలో విమల టైపు చేసిన కాగితాలు రంగనాథానికి అందించింది. ముసి ముసిగా నవ్వుకుంటూ దాదాపు ఆమె చెయ్యి పట్టుకున్నట్టే కాగితాలు అందుకున్నాడు. ఆ అమ్మాయి టేబులుమీదకు వాలి నిల్చుంది. పైట

జారింది. రంగనాథం చూపుమ....విమల సిగ్గుపడుతూ పైట సర్దుకోవడం....అమలకు వింతగా అన్పించింది. ఆ పిల్లమీద కోపం కూడా వచ్చింది.

రంగనాథం అర్థయుక్తంగా అమల ముఖంలోకి చూశాడు. 'పై ఆఫీసరుతో ఎలా ప్రవర్తించాలో తెలుసుకో.' అని చెప్తున్నట్టుగా వున్నాయి ఆ చూపులు.

"నువ్వెళ్ళు. విమల పక్క మిషన్ నీదే. వెళ్ళి కూర్చో పేపర్లు పంపిస్తాను." అధికారం ఫుట్టిపడే స్వరంతో అన్నాడు. అమల తల ఆడించి బయటికి వచ్చింది.

రంగనాథం ఆ అమ్మాయి నవ్వుకోవడం వెనకనుంచి విన్పించింది. తనను గురించే నవ్వుకుంటున్నారనిపించింది అమలకు. వాడు ఏదో అన్నాడు! ఆ పిల్ల పకపక నవ్వింది. ఛ! ఛ! ఇదేం ఆఫీసు. అమల వెళ్ళి తన సీట్లో కూర్చుని విమలకోసం ఎదురు చూడసాగింది.

ఉద్యోగంలో చేరి మూడు నెలలు గడిచాయి. కాని అమల ఆ వాతావరణంలో ఇమడలేకుండా వుంది. తన తోటి టైపిస్టు లిద్దరూ _ విమలా _ కమలా __ రంగనాథంతోనూ, తోటి గుమాస్తాలతోనూ వెకిలిగా మాట్లాడడం, అర్థం లేకుండా పకపక నవ్వడం, సిగ్గులు ఒలకబోస్తూ కులకడం అమల చూస్తూనే వుంది. వాళ్లు రంగనాథంతో కలిసి బస్టాపు

ఎదురుగా వున్న హోటల్లోకి వెళ్ళడం కూడా చూసింది. వాళ్ళు అమలకు దూరంగా వుంటారు.

ఒకరోజు ఆఫీసునుంచి ఆలస్యంగా బయలుదేరిన అమల, తన వెనకే రంగనాథం వస్తున్నట్టు గమనించింది. వెనక్కు తిరిగి చూడకుండా గబగబా వచ్చి బస్స్టాండులో నిల్చుంది. వెనకే వచ్చిన రంగనాథం పక్కన నిలబడి " అమలా ! కాఫీ తాగుదాం పద. " అన్నాడు.

" సారీ ! నేను రాను ! " ఫెడీమని కొట్టినట్టుగా అన్నది.

' ఏం ? కాఫీ తాగితే తప్పా ? మీరంతా చదువు కుంటున్నారు. ఉద్యోగాలు చేస్తున్నారు. మగవాడితో కలిసి కాఫీ తాగితేనే పాతివ్రత్యం పోతుందా ? ' వ్యంగ్యంగా అన్నాడు రంగనాథం.

" నా కిష్టంలేదు. నేను ఇష్టంలేని పనులు చస్తే చెయ్యను " కుండబద్దలు కొట్టినట్టు చెప్పి ముఖం తిప్పుకుంది.

ఆరోజునుంచి అమలకు ఆఫీసులో నరకానికి తెరలు లేచాయి చీటికి మాటికి తప్పులు పట్టుస్నాడు రంగనాథం. అయినదానికీ, కానిదానికీ బొంగురు గొంతేసుకొని అరుస్తున్నాడు. పై ఆఫీసరుకు కంప్లైంటు చెయ్యసాగాడు. విషయం అర్థంచేసుకొన్న కొందరు ఆమెను జాలిగా

చూడడం కంటే ఏమీ చెయ్యలేకపోతున్నారు. అమలను రంగనాథం సాధిస్తూ వుంటే కమల, విమల, ఒకరి ముఖంలోకి ఒకరు అర్థయుక్తంగా చూసుకుంటారు.

ఒకరోజు "నీలో ఉద్యోగంచేసే లక్షణాలు లేవు." అన్నాడు రంగనాథం.

మరో రోజు 'ఇట్లా అయితే ఈ ఉద్యోగం ఎంతో కాలం నిలబడదు.' అన్నాడు.

ఇంకో రోజు "ఆఫీసరుగారికి నువ్వు పనిచెయ్యవనే ఇంప్రెషన్ వచ్చేసింది. ఆ తర్వాత నీ ఇష్టం." అన్నాడు.

ఇలా రోజూ ఏదో రకంగా బెదిరిస్తూనే వున్నాడు.

తల్లికి బాగా జబ్బు చెయ్యడంవల్ల అమల వారం రోజులు శెలవు పెట్టింది. ఆరోజు ఆఫీసుకు రాగానే రంగనాథం పిలిపించాడు. భయపడ్తూనే వెళ్ళి నిలబడింది.

'ఇదిగో. ఇక్కడ సంతకం పెట్టు' అన్నాడు రంగనాథం.

అమల సంతకం చేస్తుంటే చెయ్యి వణికింది. రంగనాథం అందించిన 'మెమో' తీసుకొని తన సీటు దగ్గరకు వచ్చింది. అమలకు అది చదవాలంటే భయంగా వుంది. మౌనంగా చేతిలోని కాగితంకేసి కొద్ది నిముషాలు చూస్తూ వుండిపోయింది.

పక్క సీటు రామారావు ఆమెకేసి జాలిగా చూశాడు. కమలా, విమలా, ముసిముసిగా నవ్వుకుంటూ చూశారు.

అమల మెమో చదువుకుంది. ఆమె కళ్ళల్లో నీరు గిర్రున తిరిగింది.

తనకు పనిమీద శ్రద్ధ లేదా ? ఊరికే లీవులు పెడుతుందా ? తన పని సంతృప్తికరంగా లేదా ? ఆ ఇద్దరు టైపిస్టుల పని కూడా తనకే అప్పగిస్తాడే ? అయినా ఏనాడూ కిక్కురుమనలేదు.

అమల మనసు మనసులో లేదు. పనిచేస్తూనే వుంది. ఎంతకూ తరగడం లేదు. ప్యూన్ వచ్చి లైటు వేశాడు. అప్పుడు తృళ్లిపడి తలెత్తి గడియారంకేసి చూసింది. ఆరుంబావు అయింది. అందరూ వెళ్ళిపోయారు. రంగనాథం మాత్రం కూర్చుని వున్నాడు. అమల టైపుచేసిన పేపర్లు తీసుకెళ్లి రంగనాథం బల్లమీద పెట్టింది.

' అన్నీ చేశావా ? '

' ఇంకా వున్నాయి. రేపు చేస్తాను. ' అంటూ మరో ప్రశ్నకు అవకాశం ఇవ్వకుండా వెనుదిరిగింది.

' అమలా ? '

ఆగి, వెనక్కు తలతిప్పి చూసింది.

"మరీ అంత టెక్కు పనికిరాదు. మిగతా వాళ్ళను చూసైనా ఆఫీసులో ఎలా మసలుకోవాలో నేర్చుకో."

సమాధానం ఇవ్వకుండా రెండడుగలు ముందుకు వేసింది.

'మూడురోజులు టైం వుంది. బాగా ఆలోచించుకో.'

అమల ఆగింది. కాని వెనక్కు తిరక్కుండానే సమాధానం ఇచ్చింది — "అక్కర్లేదు. మూడురోజులు అక్కర్లేదు. రేపే రాజీనామా ఇస్తాను." అనేసి విసురుగా వెళ్ళిపోయింది.

రంగనాథం మతిపోయినవాడిలా ఆమె వెళ్ళినవైపే చూస్తూ వుండిపోయాడు.

బస్సు అంది, ఇంటికి చేరేసరికి రాత్రి ఎనిమిది దాటిపోయింది. తల్లి వరండాలో గుంజకు ఆనుకొని ఆయాసపడిపోతూంది.

"ఏం తల్లీ ? మందు తెచ్చావా ?" దగ్గుతెర వచ్చి ఖళ్ళు ఖళ్ళున దగ్గింది తల్లి.

"లేదమ్మా !" బాధగా అన్నది అమల.

తల్లి ఓ క్షణం కూతురి ముఖంలోకి చూసింది. 'పోనియ్‌లే తల్లీ. ఈ రాత్రికి ఎలాగో గడుపుతాను.

చిన్నపిల్లలు నిద్రకు పడ్డటున్నారు. అన్నాలు పెట్టు.'
అన్నది తల్లి.

అమల అన్యమనస్కంగానే పిల్లలకు అన్నాలు పెట్టింది. అందరూ తినగా గుప్పెడు మెతుకులు కూడా మిగల్లేదు. ' దరిద్రులకు ఆకలి ఎక్కువ. ' అన్న సామెత గుర్తొచ్చింది.

అమల అన్నం తినలేదు. నిద్రపోలేదు. రాత్రంతా మధనపడ్తూనే వుంది. మరోవైపు తల్లి ఖళ్ళు ఖళ్ళున దగ్గడం, మధ్య మధ్య ఉక్కిరి బిక్కిరి అయిపోవడం....

తను ఉద్యోగానికి రాజీనామా చేసే పరిస్థితిలో వుందా ? తను వదులుకోకపోయినా తన ఉద్యోగం పోవడం ఖాయం. ఆ తర్వాత........?

జబ్బు తల్లి—చెల్లెళ్లూ—తమ్ముళ్ళూ—అందరూ పసివాళ్లు—వాళ్ళను ఏం చేయ్యడం ? ఎలా పోషించడం ?

తను ఉద్యోగం చెయ్యాలి. తప్పదు.

అందుకోసం తను కమలలా, విమలలా_ఓ భగవాన్.... తల రెండు చేతులతో పట్టుకొని కొద్ది క్షణాలు వుండిపోయింది.

నో ! నో ! తను అలా చస్తే చెయ్యదు. అలాంటి జీవితంకంటే చావడం మేలు. కాని.... కాని.... తన తర్వాత ?

తన తల్లి చచ్చిపోతుంది. తమ్ముళ్లు దొంగలవుతారు. చెల్లెళ్లు.... ? అదురుతున్న కణతల్ని రెండు చూపుడు వేళ్ళతో నొక్కుకుంది. తలలో ఏవేవో పేలిపోతున్నాయి. గుండెల్లో ఏదో తగలబడిపోతోంది. శరీరం గుడ్డసంచిలా అయిపోతోంది....

తెల్లవారి ఆఫీసులో అడుగుపెట్టింది. పర్సులో రాజీనామా లేఖ వుంది చరచర రంగనాథం గదిలోకి వెళ్ళింది. పర్సులోనుంచి లేఖ తియ్యబోయి ఆగింది.

ఆగి రంగనాథం ముఖంలోకి చూసింది. నవ్వింది.

అతను బిత్తరపోయాడు.

ఆమె మళ్ళీ నవ్వింది. తోడేలును చూసి మేకపిల్ల నవ్వినట్టు నవ్వింది.

తోడేలు పెదవులు చప్పరించింది.

ఐశ్వర్యవంతుడూ, అందగాడూ అయిన ప్రకాశరావు ఆమెను నవ్వించలేకపోయాడు.

విద్యావంతుడూ, సంస్కారవంతుడూ అయిన ఆనందరావూ ఆమెను నవ్వించలేకపోయాడు.

తోడేలు ముఖం రంగనాథం ఆమెను నవ్వించగలిగాడు.

చివరకు ఆమె నవ్వింది.

అమల నవ్వింది.

ఒక్క అమలే కాదు—ఉద్యోగాలు చేస్తున్న అమల లాంటి ఆడపిల్లలు చాలామంది రోజూ నవ్వుతూనే వున్నారు.

ఇది అమల కథ మాత్రమే కాదు.

ఇదే విమల కథ, కమల కథ కూడ.

అమలలూ, కమలలూ, విమలలూ, రంగనాథంవంటి తోడేళ్ళముందు నవ్వుతూనే వున్నారు.

ఎందుకంటూరా ?

అది మీకూ తెలుసు.

తర్వాత కథ ఏమిటంటున్నారా ?

అదీ మీకు తెలుసు.

అయినా మీరు అంటారు. " వెధవ ఉద్యోగంకోసం శీలం అమ్ముకోవాలా ఏం ? " అని.

( 1974 )